క్లుప్తంగా

కోడూరు గంగమ్మకు పూజలు


ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరులో వెలసిన గంగమ్మను భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గంగమ్మకు ఘనంగా పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇరుగులమ్మకు పూజలు


పూజలందుకున్న ఇరుగులమ్మ

సిద్దవటం : మండల కేంద్రం శివారుల్లో వెలసిన శ్రీ ఇరుగులమ్మకు ఆదివారం పూజలు నిర్వహించినట్లు ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన, అర్చనలు జరిపామన్నారు. కొందరు భక్తులు అమ్మవారికి కాయాకర్పూరాలను సమర్పించి మొక్కుబడులను చెల్లించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు సిద్దవటంలోని ఎస్టీ కాలనీకి చెందిన బాబు దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఆలయ పనులకు భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న అధికారులు, భక్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె సమీపంలో మాండవ్యా నది ఒడ్డున వెలిసిన శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం ఈఓ కొండారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య భూమిపూజ నిర్వహించారు. ఈ ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఇక్కడ ఉన్న పాత ఆలయాన్ని తొలగించారు. అందులో భాగంగా ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీఈ గంగయ్య, డిప్యూటీ తహసీల్దార్ తిమ్మారెడ్డి, కాంట్రాక్టర్ సహదేవరెడ్డి, వేదపండితులు, భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం


బోరు వేయిస్తున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ పాటుమీదపాలెం ఎస్టీ కాలనీకి ఆదివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో కొత్త బోరు వేసి మోటారు బిగించి తక్షణమే తాగునీటిని అందించారు. గిరిజనులు చెప్పిన వెంటనే సమస్య తెలుసుకుని తాగునీరు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ విప్ కొరముట్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలెంకోట రత్నమ్మ, రాజేంద్ర, క్రిష్టారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందుల పిచికారీపై డెమో

చిన్నమండెం : మండల పరిధిలోని కలిబండ, పడమటికోన గ్రామాల్లో ఆదివారం వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ దివ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 17 రకాల పథకాల గురించి అధికారులు ప్రజలకు వివరించారు. అలానే డ్రోన్ ద్వారా పొలాల్లో మందులు పిచికారీ చేసే విధానాన్ని డెమో ద్వారా చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి గీత, ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

'చెకుముఖి'లో విద్యార్థుల ప్రతిభ


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

గాలివీడు : మండల కేంద్రంలోని రవిచంద్ర ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు చెకుముఖి టాలెంట్ పరీక్షలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల యజమాన్యం శింటో ఇమ్మానుయల్, సైజు థామస్‌లు తెలిపారు. ఆదివారం అన్నమయ్య జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో మొదటి స్థానంలో నిలిచారన్నారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో ప్రశాంత్ రెడ్డి, అఫ్తాబ్, ప్రణవిలు పాల్గొంటారని తెలిపారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే ధ్యేయం

- డ్వాక్రా అక్కచెల్లెమ్మలను లక్షాధికారులను చేయడానికి చర్యలు
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

సంబేపల్లె : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నారాయణ రెడ్డిగారిపల్లి గ్రామంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డితో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజారంజకంగా ప్రభుత్వ పాలన ఉందన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ అందించిన ముఖ్యమంత్రి ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినేనని తెలపారు. గ్రామంలో సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి గ్రామాలకు పాలన తీసుకొచ్చారన్నారు. కొత్తవడ్డిపల్లె, పాలెం వాండ్లపల్లి, బీసీ కాలనీ, కొండావాండ్లపల్లి, నారాయణ రెడ్డిపల్లి, శ్రీనివాసపురం, పేయలవాండ్లపల్లె, సుద్దలవాండ్లపల్లె, యర్రగుంట్ల, హరిజనవాడ, మద్దిర వాండ్లపల్లెలలో శ్రీకాంత్ రెడ్డి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేస్తూ సమస్యలను ఆరా తీశారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రానివారికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఇంటింటా ఆనందం వ్యక్తం చేసిన మహిళలు..

అక్కా, చెల్లెమ్మలకు అండగా వైఎస్సార్ ఆసరా నిలిచిందంటూ ఎమ్మెల్యే ఎదుట డ్వాక్రా మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మహిళా సంఘాలను భారీ సమావేశాలకు తరలించుకున్నారే తప్పా వారికి లబ్ధి చేకూర్చిందిలేదన్నారు. డ్వాక్రా అక్కా, చెల్లెమ్మలను లక్షాధికారులుగా చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. సమాజ పరిస్థితులకు అనుగుణంగా మహిళల్లో మార్పు రావాలని, మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు జగనన్న ప్రభుత్వం మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని వారికి శిక్షణ ఇచ్చి వ్యాపార రంగాలలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. మహిళల భద్రత కోసం దిశా చట్టాన్ని జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిందంటూ ఎమ్మెల్యే ఎదుట మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

అక్కున చేర్చుకున్న ప్రజలు..

ఏ ప్రభుత్వం చేయని విధంగా అన్నింటిలోనూ పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందంటూ వడ్డెర, యాదవ తదితర వెనుకబడిన వర్గాలు, దళితులు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. పథకాల నుంచి రాజకీయ పదవుల వరకు వైఎస్సార్‌సీపీ బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పెద్దపీట వేసిందని సాధికారతను చేసి చూపింది ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్ రెడ్డి, వసంత శ్రీనివాసులరెడ్డి, నాగరాజు యాదవ్, జేసీఎస్ కన్వీనర్ వి.వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ రాజేశ్వరీ, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థలను బాబు నాశనం చేశారు


ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

రాయచోటి : అందరికీ సమ న్యాయం చేయాల్సిన వ్యవస్థలను చంద్రబాబు పాలనలో మేనేజ్ చేసి నాశనం చేశారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఆదివారం పీడీఆర్ కల్యాణ మండపంలో జరిగిన న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి అభివృద్ధి పనులలోను బాబు, అతని అనుయాయులు కోర్టులో వ్యాజ్యాలు వేసి పేదలకు అందకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. పథకాలపై కూడా కోర్టుల్లో కేసులు వేసి ప్రజలకు పథకాలు దక్కకుండా చేశారని విమర్శించారు.

వైఎస్ఆర్‌సీపీకి న్యాయవాదుల సహకారం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి న్యాయవాదుల సహకారం ఉండాలని రాష్ట్ర వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు ఎం.మనోహర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు న్యాయవాదుల సహకారం కావాలని కోరారు. ముఖ్యమంత్రిగా మరోసారి గెలుపొందేందుకు వచ్చే ఎన్నికల్లో పార్టీ బలోపేతం చేసేందుకు న్యాయవాదులు సిద్ధం కావాలన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా న్యాయవాదుల సంక్షేమం కోసం పథకం ప్రవేశపెట్టకపోయినా జగనన్న మాత్రమే లా నేస్తం పథకం పెట్టి జూనియర్ న్యాయవాదులను ఆదుకున్నారని అన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.25 కోట్ల నిధులను విడుదల చేశారని చెప్పారు. అనేక కమిషన్‌లలో న్యాయవాదులకు సభ్యులుగా నియమించారని అన్నారు. వచ్చే ఎన్నికలలో ప్రతి నియోజకవర్గంలో నలుగురు న్యాయవాదులకు ఎన్నికల నిమిత్తం లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఎన్నికల శిక్షణను ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ ఇంచార్జి ఎం.ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు విసి రెడ్డప్పరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకులు దశరథరామిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు సుదర్శన్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సింగారయ్య, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, వాయల్పాడు, మదనపల్లె, తంబళ్లపల్లి బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు ఎం.మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని న్యాయవాదులు శాలువా బొకేలతో ఘనంగా సన్మానించారు.

డబ్బుల కోసం డ్రామాలు ఇకనైనా ఆపు!

ఎమ్మెల్యే మేడాపై టీడీపీ నాయకుడు విజయశేఖర్‌రెడ్డి ఆరోపణలను తీవ్రంగా ఖండించిన వైఎస్సార్‌సీపీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న అన్నం నాగేంద్ర మూర్తి

నందలూరు(రాజంపేట) : రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డిని ఏకవచనంతో మాట్లాడుతూ విమర్శించేస్థాయి విజయశేఖర్ రెడ్డికి లేదని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు అన్నం నాగేంద్రమూర్తి ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డికి తిరిగి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టిక్కెట్ దక్కడంతో ఓర్చుకోలేక కనీసం తెలుగుదేశం పార్టీ కండువా కూడా కప్పుకోని నీకు తెలుగుదేశం పార్టీ టికెట్ వస్తుందని చెప్పుకోవడం హాస్యాస్పదం అన్నారు. రూ.2 కోట్లు డబ్బులు తీసుకొని వైఎస్సార్‌సీపీకి పని చేసిన చరిత్ర నీది కాదా అని ప్రశ్నించారు. సుండుపల్లె, వీరబల్లిలో నీవు చేసిన అరాచకాల చరిత్ర మా దగ్గర ఉందని, సోదరుడైన మేడా మల్లికార్జున రెడ్డిని చేతగాని ఎమ్మెల్యే అని మాట్లాడటం సరికాదన్నారు. రాజంపేట నియోజకవర్గంలో ఏయే పంచాయతీలలో ఎంత అభివృద్ధి చేశామో చూపించడానికి మేము సిద్ధమే అని సవాళ్లు విసిరారు. ఎన్నికల సమయంలో డబ్బుల కోసం డ్రామాలను మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ మెంబర్ కరీముల్లా ఖాన్, నాయకులు పాలగిరి సుధాకర్ రెడ్డి, పెనుబాల నాగసుబ్బయ్య, అరిగె నాని, కాకి చంద్రాలు పాల్గొన్నారు.

నోరు అదుపులో పెట్టుకో..

సిద్దవటం : పెద్దబాబు నువ్వు చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకునే రకం, నీవు చేసిన అవినీతి, అరాచకాలు, కబ్జాలు తెలిసే ఎమ్మెల్యే నిన్ను దూరం పెట్టారని, ఈరోజు తెలుగుదేశం పార్టీలో చేరి మేడాపై అవాకులు, చవాకులు పేలితే చూస్తూ ఊరుకోబోమని అని వైఎస్సార్‌సీపీ సిద్దవటం మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి హెచ్చరించారు. ఆదివారం వారు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ విజయశేఖర్ రెడ్డి నీవు ఎవరు, ఈరోజు ఎమ్మెల్యే, ఆయన సోదరుల లేకుంటే నీ బతుకేంటి అని ప్రశ్నించారు. మీ నాన్న ఒక సాధారణ డీలర్‌గా మొదలైతే, ఇప్పుడు నీవు ఉన్న కోట్ల రూపాయల ఇల్లు మేడా రఘునాథరెడ్డి కట్టించింది కదా అని తెలియజేశారు. సుండుపల్లెలో నీవు చేసిన భూ దోపిడీలకు అంతే లేదన్నారు. ఎక్కడ నీ పేరు చెప్పినా నీ కబ్జా బాగోతాలను ప్రజలు కథలుగా చెప్తారని ఎద్దేవా చేశారు. ఇవన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే నిన్ను పక్కన పెడితే ఇప్పుడు ఆయనపైనే ఆరోపణలా అంటూ మండిపడ్డారు. సర్పంచ్‌గా కూడా గెలవలేని స్థాయి నీది అని గుర్తుచేశారు. బుద్ధితెచ్చుకొని ఇకనైన నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, వైఎస్ఆర్ సీపీ నాయకుడు పి.శివారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి


ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్న తదితర డిమాండ్‌లతో గత కొన్నేళ్లుగా తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరింపజేసి సమ్మెను విరమింప చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, మున్సిపల్ కార్మిక సంఘం నేతలు రాంబాబు, చెన్నయ్యలతో పాటు కార్మికులు సిద్దయ్య, మంగమ్మ, తిరుపతమ్మ, ఆంజనేయులు, రవికుమార్, వెంకటరమణ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజం కోసమే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్‌లు


సర్వే నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : సమాజం కోసమే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నామని ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు హేమలత, కృష్ణవేణులు అన్నారు. మండలంలో పోలీస్ స్టేషన్, మోడల్ స్కూల్ ఇతర ప్రాంతాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో సమావేశం నిర్వహించి క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. అలాగే ఆదివారం ఉపాధి లేని యువతపై ఇంటింటా సర్వే జరిపారు. దాదాపు 100 కుటుంబాలలో సర్వే నిర్వహించామన్నారు. పీజీ చేసి ఖాళీగా ఉన్నవారు ఎంతమంది ఉన్నారో సర్వే చేశామని, ఇంకా పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు తెలియజేశారు.

మానవత చేయూత

చిట్వేలి : అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున ఆదివారం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చిట్వేలిశాఖ సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న అనుంపల్లికి చెందిన మాదినేని చంద్రశేఖర్, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిట్వేలికి చెందిన ఆవుల జయమ్మకు రూ. 5 వేలు మొత్తం రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

అన్నదానం

రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో డి.వి.రమణయ్య 23వ వర్ధంతి సందర్భంగా దాత రాజేశ్వరి ఆదివారం మండలంలోని బండపల్లె వద్ద ఉన్న ప్రేమాలయం ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వ్యవస్థాపక అధ్యక్షులు హరినాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు వంశీకృష్ణ, భారతి, దేవికృతిక, వెంకటకృష్ణసాయి, ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరటితోటపై పందుల దాడి


పందుల వల్ల పూర్తిగా దెబ్బతిన్న అరటి పంట

రైల్వేకోడూరు : మండలంలోని పలు గ్రామాలలో పందులతో అరటిరైతులకు తిప్పలు మొదలయ్యాయి. ఆదివారం వేకువజామున అనంతరాజుపేట, రాఘవరాజుపురం పంచాయతీల్లో పందులు అరటి మొలకలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వేలాది రుపాయలు ఖర్చుపెట్టి సాగుచేసిన అరటిని మొదట్లోనే ఇలా పందులు దెబ్బతియ్యడంతో ఆదిలోనే నష్టాలను చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇకనైనా పందులు పంట పొలాలను నాశనం చేయకుండా అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కోడూరుకు కొత్త సొబగు

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోడూరు పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పట్టణంలోని డివైడర్ సుందరీకరణలో భాగంగా ఆదివారం ఉప సర్పంచ్ తోట శివసాయి ఆధ్వర్యంలో నూతనంగా బటర్ ఫ్లై లైట్లను ఏర్పాటు చేసి పట్టణానికి కొత్త సొగసును అందించారు. భారీ క్రేన్ సహాయంతో లైట్లను అమర్చారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు

ఓబులవారిపల్లె : మండలంలోని ముక్కవారిపల్లె పంచాయతీలో ఆదివారం ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి సహకారంతో తురకపల్లి గ్రామంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో విద్యుత్ దీపాలు లేక చాలా రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎంపీడీఓ విజయారావు దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన వత్తలూరు సాయికిషోర్ రెడ్డి సహకారంతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ నాయకులు మారే సుకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కనుల పండువగా రంగనాథస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో కల్యాణ ఉత్సవమూర్తులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని తోట కల్యాణ మండపంలో ఆదివారం తిరుప్పావై భక్త సేవా సమితి ఆధ్వర్యంలో గోదాదేవి, మహాలక్ష్మీదేవి సమేత రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తొలుత కల్యాణ ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. అనంతరం పురోహితులు వేదమంత్రోచ్చారణలతో స్వామివారి కల్యాణ క్రతువును కమనీయంగా జరిపారు. కల్యాణంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

విశేష పూజలందుకున్న అనంతపురం గంగమ్మ


అలంకారంలో అనంతపురం గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ దేవత ఆదివారం భక్తుల విశేష పూజలందుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా ఇతర మండలాలు, జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో పోటెత్తింది. ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీందర్ రాజులు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారులైన ఆదిమూలం వంశీయులు అనంతపురం గంగమ్మ దేవత దర్శనం కల్పిస్తూ అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహింపచేశారు. అనంతరం మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి ఆభరణాల బహూకరణ


పూజలు నిర్వహిస్తున్న దాతల కుటుంబసభ్యులు

సంబేపల్లె : మండల కేంద్రంలో వెలసిన దేవరరాయి నల్లగంగమ్మకు ఆదివారం కడపలోని చిన్నచౌక్ రెడ్డీస్ కాలనీకి చెందిన రాధాకృష్ణ కుమారుడు మనోజ్ 1833 గ్రాముల 500 మిల్లీ గ్రాముల నాగపడిగెలతో కూడిన వెండి ముఖ కవచం, కిరీటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులచే ప్రత్యేక పూజలు గావింపచేసి తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ కొండారెడ్డి, సర్పంచ్ అంచల రామచంద్ర, గడికోట చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరాముడి శోభాయాత్రకు నీరాజనాలు


శోభాయాత్రకు సంఘీభావం తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

నందలూరు(రాజంపేట) : శ్రీరామచంద్రుల వారి జన్మభూమి అయోధ్య రామ మందిరం నిర్మాణం పూర్తి చేసుకొని, జనవరి 22వ తేదీన జరగబోవు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రకు భక్తులు ఆదివారం నీరాజనాలు పలికారు. నాగిరెడ్డిపల్లి గ్రామంలోని ఎర్రచెరువు కట్టపై వెలసిన ఆంజనేయస్వామి ఆలయం నుంచి నిర్వాహకులు డాక్టర్ అరిగె రాంప్రసాద్, పోతురాజు మస్తానయ్య, ఎంబలూరు నరసింహస్వామి, హెచ్‌డీ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో డీసీఎం రోడ్డు, అరవపల్లి మీదుగా శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయం వరకు బాణసంచా, భజనలు, కోలాటాల మధ్య శోభాయాత్ర కనుల పండువగా సాగింది. ముందుగా గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. శోభా యాత్రలో సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం యాత్రలో పాల్గొన్న భక్తులకు సౌమ్యనాథస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాగా శోభాయాత్రలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, బీజేపీ పార్లమెంటరీ నాయకులు సాయి లోకేష్, బీజేపీ రాష్ట్ర నాయకులు నాగోతు రమేష్ నాయుడు, జనసేన నాయకులు ఎల్లటూరు శివరామరాజు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, భక్తులు, మహిళలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ


అక్షింతలు పంపిణీ చేస్తున్న రామభక్త సేవా సమితి ప్రతినిధులు

రాజంపేట టౌన్ : అయోధ్య నుంచి వచ్చిన రాములవారి అక్షింతలను ఆదివారం శ్రీరామభక్త సేవా సమితి ప్రతినిధులు ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిరంలో ఈనెల 22వ తేదీ బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించే కార్యక్రమాన్ని పురస్కరించుకొని దేశంలోని అన్ని ప్రాంతాల్లో హిందువుల ఇళ్లకు స్వామివారి చిత్రపటం, అక్షింతలను రామభక్తులు పంపిణీ చేస్తున్నారన్నారని తెలిపారు. అందులో భాగంగా పట్టణంలో ఈ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని కోరారు. అలాగే ప్రధాని మోది పిలుపుమేరకు అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ రోజు రాత్రి హిందువులు తమ ఇంటిముంగిట దీపాలను వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరామభక్త సేవా సమితి ప్రతినిధులు ఏ.శంకర్‌రాజు, డి.హరిగోపాల్‌నాయుడు, భారతి, ఆవుల సూర్యరంగనాయకులు, ఎం.పుష్పలత, రంగారావు, శివారెడ్డి, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో నీటి సమస్య పరిష్కారం


జిల్లా ఆస్పత్రిలో నూతన బోరుకు మోటార్ అమర్చి నీటిని వదిలిన మేఘా సిబ్బంది

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో కొంతకాలంగా నెలకున్న నీటిసమస్యకు పరిష్కారం లభించింది. జిల్లా ఆస్పత్రిలో నీటికొరతతో రోగులు, సహాయకులు ఇబ్బందులు పడుతున్న విషయంపై రెండువారాల క్రితం సాక్షిలో జిల్లా ఆస్పత్రిలో నీటి కటకట శీర్షికన కథనం ప్రచురితమైంది. జిల్లా ఆస్పత్రిలో ప్రస్తుతం మదనపల్లె మెడికల్ కళాశాలకు సంబంధించి మేఘా ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆధ్వర్యంలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణపనులకు మేఘా సంస్థ ఆస్పత్రిలోని బోరునీటిని వాడుకోవటంతో నీటివినియోగం అధికమై సమస్య ఏర్పడింది. దీంతో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. పద్మాంజలి అభ్యర్థన మేరకు... మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా జిల్లా ఆస్పత్రికి నీటిని తరలించినప్పటికీ, సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో మేఘా ఇంజనీరింగ్ సంస్థ నీటిసమస్య పరిష్కారానికి ముందుకు వచ్చి ఆస్పత్రి ప్రాంగణంలో రూ.4.75లక్షలతో కొత్తగా బోరును డ్రిల్ చేశారు. 675 అడుగుల లోతులో దాదాపు 2 ఇంచీలకు పైగా నీరు సమృద్ధిగా పడటంతో పైప్‌లైన్, మోటార్ అమర్చి ఆదివారం ఆస్పత్రికి నీటిసరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో మేఘా ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ మేనేజర్ కమలాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.